RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

మాట జారకుండా ఉన్నప్పుడే మాట పడాల్సిన పరిస్థితి రాదు.

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 181

సోమవారం, జూన్ 15, 2026, పేజీలు - 4 వెల : 2/-

## వర్షాల నేపథ్యంలో

# అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్, జూన్ 14 :** వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రకృతి విపత్తులపై సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు. (ఆదివారం) హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వర్షాలు, ప్రకృతి విపత్తులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులు, వరద ముప్పు, పట్టణాలు, గ్రామాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బీ, జలమండలి వంటి విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొని తమ శాఖల సిద్ధతపై వివరాలు అందించారు. ఈ సమావేశంలో వరదల నివారణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, అత్యవసర సేవల సమన్వయం, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు, ఎప్పటికప్పుడు అప్రమత్తత అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కూడా హాజరయ్యారు. పోలీస్ శాఖ నుంచి సజ్జనార్, రమేశ్ రెడ్డి, సుమతి వంటి పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

## సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా

# మాట్లాడుతున్నారు

- ◆సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని
- ◆సింగరేణిపై కొంతమంది అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు
- ◆మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు.
- ◆రాజకీయాల కోసం, స్వార్థం కోసం హితవు పలికారు.



**మంచిర్యాల, జూన్ 14 :** బొగ్గు నిల్వలు మాయమైనట్లుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద సింగరేణి అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని (ఆదివారం) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. సింగరేణి కార్మికుడి శ్రమ, చెమటని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిపై చేస్తున్న ఆరోపణలతో తన మనసు కలచి వేసిందని.. అందుకే అధికారులతో కలిసి ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. మీ రాజకీయాల కోసం, స్వార్థం కోసం తెలంగాణ భవిష్యత్తు అయిన సింగరేణిని అపహాస్యం చేయొద్దని హితవు పలికారు. బొగ్గును వెలికి తీసిన తర్వాత గ్రేడ్‌ల వారీగా స్టాక్ పెడతామని వివరించారు. నిల్వలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. బొగ్గు తరలించే వాహనాలకు జీపీఎస్ సైతం ఉంటుందని స్పష్టం చేశారు. విజిలెన్స్ మానిటరింగ్ కూడా ఉంటుందని చెప్పుకొచ్చారు. కిలో బొగ్గు బయటకు వెళ్లే అవకాశం లేదని తేల్చిచెప్పారు. అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోంది: మల్లు భట్టి విక్రమార్కఎస్ఐఆర్‌ను అడ్డంపెట్టుకొని అసలైన ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతోందని మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఓటు లేకపోతే పౌరసత్వానికి ప్రమాదం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్‌ఏల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావ్, ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్‌కి మద్దతు తెలిపే వారిని ఏఐ టెక్నాలజీతో లిస్టు ఔట్ చేస్తున్నారని.. వారందరిని హోల్డ్‌లో పెడుతున్నారని తెలిపారు. బీజేపీ నేతలు చాలా ప్లాన్డ్‌గా ఓట్ల తొలగిస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అయ్యే సమయంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని.. కానీ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఓటర్ల మ్యాపింగ్ కాలేదని 80 వేల మందిని అన్ మ్యాపింగ్ చేశారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## నన్ను తరిమికొట్టే వ్యక్తి

# ఈ గడ్డ మీద పుట్టలేదు



**హైదరాబాద్, జూన్14:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్ పేటలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలుకు కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. మెట్రోకు నగదు ఇవ్వకుంటే తాము రాజీనామా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని మీరు రాజీనామా చేస్తారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తనను తరిమికొడతామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు. అయితే తాను బీఆర్ఎస్ కార్యకర్తను కాదని.. బీజేపీ కార్యకర్తనని తెలిపారు. తనను తరిమికొట్టే వ్యక్తి ఈ గడ్డ మీద ఇంకా పుట్టలేదని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలను కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరు రాజీనామా చేస్తారో చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలను ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టారని.. 2028లో ఈ ఆటను బీజేపీ ముగిస్తుందన్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని బీజేపీ సీనియర్ నేత,కుండబద్దలు కొట్టారు.

## రాజీనామా చేసిన అంగన్వాడీ టీచర్లు,

# మళ్లీ ఉద్యోగాల్లోకి



**హైదరాబాద్, జూన్14:** తెలంగాణలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలల కిందట రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, మున్సి పల్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఎన్నికల్లో చాలా మంది పోటీలో నిలిచారు. కానీ అందులో కొందరే గెలిచి.. పదవులను చేపట్టగా.. మిగిలిన వారు ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండ కూడదు అనే నిబంధన ఉంది. అందుకే తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి మరీ కొందరు ఎన్నికల్లో బరిలో దిగుతూ ఉంటారు. ఎన్నికల్లో ఓడిపోతే అటు పదవితోపాటు.. ఇటు ప్రభుత్వ ఉద్యోగం కూడా పోతుంది. ఈ క్రమంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి.. ఓడిపోయిన అంగన్వాడీ సిబ్బందికి.. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గుడ్‌న్యూస్ చెప్పారు. వారిని పునర్నియమించేందుకు అవకాశం కల్పించనున్నారు. మంత్రి సీతక్క చొరవతో అర్హులైన వారు విధుల్లోకి తిరిగి వచ్చేందుకు మార్గం సుగమం అయింది. రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పునర్నియామక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి.. తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాజీనామా చేసిన అంగన్వాడీ టీచర్, హెల్పర్ స్థానంలో.. ఇప్పటివరకు ఇంకో అభ్యర్థిని నియమించని ప్రాంతాల్లో మాత్రమే తిరిగి పాత వారిని నియమించుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ మేరకు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు వెలువరించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, సిబ్బంది సంక్షేమానికి రేవంత్ రెడ్డి సర్కార్ అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అర్హులైన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నుంచి అభ్యర్థనలతోపాటు.. రూల్స్ ప్రకారం వెంటనే వాటిని పరిశీలించి వారిని మంత్రి చెప్పారు. దీంతో రాజీనామా చేసిన అంగన్వాడీ సిబ్బందిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

## బాకీతో సహా మొత్తం ఆడబిడ్డలకు ఇయ్..

# నేను రాజీనామా చేస్తా




రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అంటుండు.. నువ్వు కోటీశ్వరులను చేసుడు దేవుడెరుగు.. నువ్వు ముందైతే లక్షాధికారులు చెయ్. ఒక్కొక్క ఆడబిడ్డకు లక్షా 50 వేలు ఇస్తా అని చెప్పినవ్ కదా.. నువ్వు కోటి మంది ఆడబిడ్డలకు ఇస్తే నేను రాజీనామా చేసి పోతా అని రేవంత్ రెడ్డికి చెబుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, పార్టీకి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి బాధల్లా మన పదవులు కావాలనే కదా.. మనముండొద్దు రాజకీయంలో పక్కకు పోవాలనే కదా.. ఆడబిడ్డలకు పోయిన రెండున్నరేళ్లు వచ్చే రెండున్నరేళ్లు బాకీతో సహా ఒక్కొక్కరికి రూ. లక్షా 50 వేల చొప్పున మొత్తం ఆడబిడ్డలకు ఇయ్.. నేను రాజీనామా చేస్తా.. అట్లాగే మా తమ్ముళ్లకు రూ. 4వేలు నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పినవ్ కదా.. పోయిన రెండున్నర సంవవత్సరాలు, మొత్తం కలిపి 40 లక్షల మంది మా తమ్ముళ్లకు, చెల్లెళ్లకు ఇయ్.. తప్పకుండా రాజకీయమే వదిలేస్తా అని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. మళ్లీ 2028లో కూడా గులాబీ జెండా ఎగరేద్దామా.. ?మోచేతికి బెల్లం పెట్టిండు. ఆగం చేసిండు.. పోయి కుర్చీల కూర్చున్నడు. హైదరాబాదోళ్లు, ఖైరతాబాద్‌లో ఒక్కడు కూడా కాంగ్రెస్ పార్టీని నమ్మలేదు. మీరు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇయ్యలేదు. మీరేమన్నా నాగేందర్‌కు ఓటేశారా.. మీరంతా కేసీఆర్‌కు వేశారు. మాకు తెలుసునన్నారు. నాగేందర్‌ను చూసి ఓటేస్తే మొత్తం నాకేస్తడు.. తెల్వదా మనకు.. అన్నట్టే నాకేసిండు.

## రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్‌డీఏ

# మరి లోక్‌సభ మాటేమిటి

**బంగాల్:** తృణమూల్ కాంగ్రెస్‌లో మొదలైన తిరుగుబాటు, కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమికి పార్లమెంట్‌లో కలిసిరానుంది. కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించుకోవడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధన దిశగా ఎన్‌డీఏ అడుగులు వేస్తోంది. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికలు, టీఎంసీ ఎంపీల రాజీనామాలతో ఎగువ సభలో ఎన్‌డీఏ బలం పెరిగి మూడింట రెండొంతుల మెజార్టీకి చేరువైంది. లోక్‌సభలో మాత్రం ఆ మ్యాజిక్ ఫిగర్‌కు ఎన్‌డీఏ కూటమి ఇంకా దూరంలోనే ఉంది.

టీఎంసీలో లొల్లి బీజేపీకి కలిసొస్తుందాపార్లమెంటు ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు ప్రయత్నిస్తున్న ఎన్‌డీఏకు, టీఎంసీలో తలెత్తిన అంతర్గత తిరుగుబాటు బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. రాజ్యసభలో ప్రస్తుతం ఎన్‌డీఏ బలం 148 కాగా, ఝార్ఖండ్, మిజోరాంలో స్వతంత్ర స్థానాల ఎన్నికల ద్వారా మరో మూడు సీట్లు కూటమి ఖాతాలో పడనున్నాయి. దీనికి తోడు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేయడంతో, బంగాల్ ఉపఎన్నికల తర్వాత ఆ మూడు స్థానాలను కూడా ఎన్‌డీఏ గెలుచుకోనుంది. దీంతో ఎగువ సభలో ఎన్?డీఏ బలం 154కి చేరనుంది. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ




సాధించాలంటే 163 స్థానాలు ఉండాలి. దీనికి ఎన్‌డీఏ కూటమి కేవలం 9 స్థానాల దూరంలో ఉంటుంది. రానున్న రోజుల్లో మరికొందరు టీఎంసీ ఎంపీలు (సుమారు 20 మంది) రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈ కారణంగా ఎన్‌డీఏ సులభంగానే 163 మార్కును దాటి, కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.


## ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి భారత్‌ఎదిగింది

**న్యూ ఢిల్లీ :** భారత్ కేవలం తన సుస్థిర భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచం కోసం సరికొత్త ఆవిష్కరణలు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇతరులు కనుగొన్న పరిష్కారాలను వాడుకునే దేశంగా మాత్రమే భారత్ మిగిలిపోలేదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించే స్థాయికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'భారత్ ఇన్నోవేట్స్' సదస్సులో ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఉన్న బంధాన్ని, సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రధాని మోదీ కొనియాడారు. "ఆవిష్కరణ అనేది భారతదేశ డీఎన్‌ఏలోనే ఉంది. వేల సంవత్సరాలుగా భారత్ తన జ్ఞానం, నూతన ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి సరికొత్త దిశను చూపిస్తూ వస్తోంది. గణితం నుంచి ఖగోళ శాస్త్రం వరకు,వారసత్వానికి సరికొత్త వేగాన్ని, సరికొత్త దిశను అందించాం.

## సర్' పేరుతో మోదీ సర్కార్ ప్రతిపక్షాల

# ఓట్లు తీసేస్తోంది.

**హనుమకొండ, జూన్ 14 :** కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 'సర్' పేరుతో ప్రతిపక్షాల ఓట్లు తీసేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్'పై మనం అప్రమత్తంగా ఉంటే ఏం కాదని చెప్పుకొచ్చారు. (ఆదివారం) హనుమకొండలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 'సర్'పై కార్యకర్తల కు అవగాహన కల్పించారు. 'సర్' పై చాలా జాగ్రత్తగా ఉంటేనే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పోవాలే.. కేసీఆర్ అధికారంలోకి రావాలని జనం అంటున్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కల్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని



ప్రస్తావించారు. కల్యాణలక్ష్మితో బాల్య వివాహాలు ఆగిపోయాయని తెలిపారు. కేసీఆర్ సంక్షేమ పథకాల వెనక ఒక విజన్ ఉందని ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నరేళ్లుగా కొట్లాడుతున్నామని తెలిపారు. కార్యకర్తల అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తల పిల్లల కోసం పుస్తకాలను పార్టీ నేతలు పంపిణీ చేయడం సంతోషకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# అమీన్‌పూర్‌లో గీతాంజలి స్కూల్ ప్రారంభం

**- పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్**






**అమీన్‌పూర్, జూన్ 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని సాయి రామ్ ఎంక్లేవ్ ఫేస్-2లో గీతాంజలి పాఠశాల నూతన శాఖను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరుకాగా, ఆయనతో పాటు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు అతిథులు కలిసి పాఠశాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అమీన్‌పూర్ ప్రాంతంలో అత్యాధునిక వసతులతో గీతాంజలి పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఇప్పటికే ఇస్నాపూర్‌లో విద్యాబోధనలో మంచి పేరు సంపాదించుకున్న ఈ యాజమాన్యం, ఇప్పుడు అమీన్‌పూర్‌లో మరో పాఠశాలను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నతమైన విద్యను అందించడంలో ఈ పాఠశాల కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యే లక్ష్యం: యాజమాన్యంఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. "ఇస్నాపూర్‌లో విజయవంతంగా పాఠశాలను నిర్వహిస్తున్న మాకు, ఇప్పుడు అమీన్‌పూర్‌లో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. విద్యను వ్యాపారంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావిస్తున్నాం. ముఖ్యంగా పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యను అందించడమే మా ప్రధాన లక్ష్యం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, అన్ని రకాల ఆధునిక వసతులతో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జెడ్పీటీసి సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మండల ఎంఈఓ సుధాకర్,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కొల్లూరు గోపాల్, జ్ఞానేశ్వర్, భాస్కర్ రెడ్డి, లింగం గౌడ్, ఐలాపూర్ నర్సింగ్ రావు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులుతల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



**గుమ్మడిదల, జూన్ 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
మద్యానికి బానిసై మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. గుమ్మడిదల సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగులో నివాసం ఉంటున్న రాజు అనే వ్యక్తి స్థానికంగా ఉన్న హెట్రో కంపెనీలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఒంటరిగా ఉంటున్న రాజు, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురైన రాజు, ఆదివారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీనిపై మరింత దర్యాప్తు చేస్తున్నారు.

# తాపీ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్‌పూర్, జూన్ 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో భవన నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న తాపీ మేస్త్రీలు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, వారికి ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల ట్రేడ్ యూనియన్ మరియు తాపీ మేస్త్రీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**నెల రోజుల్లో స్థల కేటాయింపు:**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో కార్మికుల శ్రమ ఎంతో విలువైనదని కొనియాడారు. వారి సంక్షేమం కోసం అసోసియేషన్ కార్యాలయం నిర్మించుకోవడానికి స్థలాన్ని కేటాయిస్తానని, రాబోయే నెల రోజుల్లోనే స్థల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తానని భరోసానిచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు సమాన హక్కులు కల్పించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ వారికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

**నిరసన దీక్షలకు మద్దతు:**
గత వారం రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం తాపీ మేస్త్రీలు చేస్తున్న సమ్మెపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నిన్న గుట్ట కమాన్ వద్ద చేపట్టిన భారీ ర్యాలీని ప్రస్తావిస్తూ, కార్మికుల ఐక్యతను అభినందించారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి తన వంతు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ సహకారం



అందాలి: యూనియన్ అధ్యక్షుడు నాగేందర్
సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేందర్ బాబు మాట్లాడుతూ, "అమీన్‌పూర్ మండలంలో సుమారు 600 మంది తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ఉన్నాం. ప్రస్తుతం ప్రభుత్వం నుండి మాకు అందాల్సిన ప్రయోజనాలు అందడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే గారు స్వయంగా విచ్చేసి, మా సమస్యల పరిష్కారానికి, కార్యాలయ నిర్మాణానికి స్థలం ఇస్తామని హామీ ఇవ్వడం మాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది," అని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, జ్ఞానేశ్వర్, భాస్కర్ రెడ్డి, లింగం గౌడ్, ఐలాపూర్ నర్సింగ్ రావు, సంఘం సభ్యులు మరియు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఈ మూడు రోజులు భారీ వర్షాలు : వాతావరణశాఖ



**హైదరాబాద్:** తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురందించింది. రాగల 3,4 రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని, వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈనెల 18, 19,20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మరో 3 రోజులపాటు మార్పు ఉండదని పేర్కొంది. ఇవాళ, రేపు కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.విస్తరించి ఉన్న ద్రోణి : దక్షిణ కోస్తాంధ్రకు ఆనుకుని ఉన్న ద్రోణి పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి నైరుతి బంగాళాఖాతం మీదుగా దక్షిణ తమిళనాడు వరకు , సముద్రమట్టానికి 3.1 నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తు మధ్య విస్తరించి ఉందని వాతావరణశాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి సోలాపూర్, హైదరాబాద్, భద్రాద్రి, కొత్తగూడెం, కళింగపట్నం, పారాదీప్, బరిపద, పురూలియా, ధన్‌బాద్, ముజఫర్?పూర్ మీదుగా కొనసాగుతున్నట్లుగా ఐఎండీ వెల్లడించింది.వర్షాల నేపథ్యంలో పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి : వర్షాల నేపథ్యంలో విద్యుత్?శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో ఉండని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారులు నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. అవసరం అయితే తాను కూడా వచ్చి పరిశీలిస్తానన్నారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్? అయితే బాధ్యులపై చర్యలు తప్పవని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వర్షాలు, ప్రకృతి విపత్తులపై సమీక్ష నిర్వహించిన సీఎం వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మానవ తప్పదాల వల్ల సమస్య వస్తే సహించేది లేదన్నారు. ట్రాఫిక్? డిపార్ట్?మెంట్?లో తక్షణమే ఖాళీల భర్తీ చేయాలన్నారు. వర్షాల సమయంలో క్యూర్? ఏరియాలో మునిసిపల్, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం వద్ద స్ట్రీట్ లైట్ కరెంట్ తీగలు తెగిపడిపోయాయి. అప్పుడే ఆటోలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు తెగిపడిన తీగలు గుర్తించకపోవడంతో విద్యుత్ షాక్?తో మృతి చెందారు. ప్రాణాలు కోల్పోయిన వారు జాఫర్, అబూలుగా గుర్తించారు. ఈ విధంగా తెగిన విద్యుత్ తీగలను సకాలంలో తొలగించట్లేదని నగరవాసులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.తండ్రీకుమార్తెల మృతి : మేడ్చల్?-మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 2:45 గంటల సమయంలో భారీ గాలివాన కారణంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. ఈ క్రమంలో లాల్‌బజార్ సెక్షన్ పరిధిలోని టెలికాం కాలనీ, రోడ్ నెం.7, హౌస్ నెం. 1-30-24/7 సమీపంలో ఒక భారీ వృక్షం నేలకూలి అక్కడ పార్క్ చేసి ఉన్న కారుపై పడింది. చెట్టు కూలిన సమయంలో వీధి దీపాల విద్యుత్ కేబుల్ కూడా తెగి చెట్టు కొమ్మలతో పాటు కారుపై పడింది. కారు యజమాని సందీప్ భార్య ఆ వైరును పక్కకు తొలగించేందుకు ప్రయత్నించగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన సందీప్, ఆయన కుమార్తె రితికకు కూడా విద్యుత్ షాక్ తగిలింది. ఈ విషాద సంఘటనలో సందీప్, రితిక దురదృష్టవశాత్తు మృతి చెందగా, సందీప్ భార్య ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.అధికారుల హెచ్చరికలు : తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలను వర్షం సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షాల సమయంలో చెట్ల కింద నిలబడటం, వాటి కొమ్మలను స్వయంగా తొలగించే ప్రయత్నాలు చేయొద్దన్నారు. సమీప టీజీఎస్పీడీసీఎల్ అధికారులకులేదని అన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్, బ్లాక్? స్పాట్లు, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా వర్షాల సమయంలో పనిచేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలి : వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ? మాన్యువల్ ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. వర్షాలు, ప్రకృతి విపత్తులపై సమీక్ష నిర్వహించిన సీఎం వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టుల సీఈలు, ఎస్?సీలు సీజన్?లో స్థానికంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్టులను వదిలివస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించారు. ఇరిగేషన్? మెట్రో వాటర్? బోర్డు, ఆర్?డబ్ల్యూఎస్? అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు కొండంత అండ: కాట శ్రీనివాస్ గౌడ్





**పటాన్‌చెరు, జూన్ 14:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారుతోందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు మొత్తం ఆరు లక్షల అరవై నాలుగు వేల ఐదు వందల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు.

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం:**
ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. "ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోంది. ప్రమాదాలు, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నాము. నియోజకవర్గ ప్రజలు ఏ కష్టాల్లో ఉన్నా, వారి పక్షాన ఉండి పరిష్కారానికి కృషి చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, సుధాకర్ యాదవ్, మన్నె రవీందర్, మున్నా, రమేష్ యాదవ్, నరేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, విజయ్, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం తల్లి,బిడ్డ క్షేమం



**రాయపోల్ :** సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన లోనే ప్రసవించింది. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కి సమాచారం ఇచ్చారు.దౌల్తాబాద్ నుంచి వచ్చిన 108 అంబులెన్స్ సిబ్బంది ఆమెను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. ఆమె ఆడ బిడ్డకి జన్మనిచ్చింది. తల్లి,బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా గర్భిణికి సహాయమందిచిన 108 సిబ్బంది దేవేందర్, నర్సింలుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న
## ఏలూరు మేయర్ భర్త ముజ్బుర్ రహమాన్



**జగిత్యాల :** జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు భర్త ముజ్బుర్ రహమాన్ (ఏలూరు పెద్ద బాబు) దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముజ్బుర్ రహమాన్ అంజన్న స్వామి ఆశీస్సులు పొందా రు.అనంతరం ఆలయ ముఖ్య అర్చకుడు చింటు స్వామి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముస్లిం మత స్తుడిగా కొండగట్టు అంజన్న స్వామివారిని దర్శించుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి సందర్భాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని భక్తులు అభిప్రాయపడ్డారు. కొండగట్టు క్షేత్రం అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోందని పేర్కొన్నారు.

# రక్తదానం ప్రాణదానం
## డాక్టర్ విజయ్ భాస్కర్



**బాన్సువాడ, జూన్ 14 :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని బాన్సువాడ బ్లడ్ బ్యాంక్ లో ఆదివారం రోజు స్వచ్ఛంద రక్తదానం శిబిరాన్ని ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సహకా రంతో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 35 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం దానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసినవారు అవుతారని అన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన యువకులను ఆయన అభినందించారు. రక్తదానం చేసిన యువకులకు డాక్టర్ శ్రీను నాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందచేశారు. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తదాతలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అచ్చుకట్ల జీవన్, బ్లడ్ బ్యాంక్ పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, రాఘవేందర్, ఎబినైజర్, రక్త దాతలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూకంపం
## రిక్టర్‌స్కేలుపై 3.8 తీవ్రత నమోదు




**భద్రాద్రి:** కొత్తగూడెం జిల్లాలో భూ ప్రకంపలు కలకలం రేపాయి. కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, పాల్వంచలో భూమి స్వల్పంగా కంపించింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజామున 2.26 గంటల సమయంలో భూ ప్రకంపనలు నమోదయ్యాయి.రిక్టర్‌స్కేలుపై భూకంప తీవ్రత 3.8గా నమోదైందని అధికారులు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో భూ ప్రకంపనలు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. కాగా, ఈ భూకంపం వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జంగలేదు.

# ఉచిత వైద్య శిబిరానికి అనుహస్పందన



**తాండూర్ :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని అచ్చలాపూం భారతి తీర్థ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. గ్రామానికి చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అభినయకుమార్ గట్టు నేతృత్వంలో వైద్యులు ముద్దు రాఘవ కృష్ణ , సృష్టి వైద్య శిబిరంలో పాల్గొని వివిధ రకాల కార్పోరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.తాండూర్, బెల్లంపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు వివిధ సమస్యలతో శిఖరానికి వచ్చి పరీక్షలను చేసుకన్నారు. సుమారు 250 మందిని పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రులకు రెఫర్ చేశారు. హైదరాబాద్, అహ్మదాబాద్ పట్టణాలలో వైద్య వృత్తి నిర్వహిస్తూ పేరు ప్రఖ్యాతులు ఘటించిన ఈ ముగ్గురు వైద్యులు కూడా అచ్చలాపూర్ వాస్తవ్యులే కావడం గమనార్హం.అచ్చలాపుర్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గట్టు విశ్వనాథ్ శర్మ దంపతుల సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని స్థానిక మహావేద పాఠశాల ప్రధాన అధ్యాపకుడు దుద్దిల్ల మనోహర్ శర్మ జ్యోతిప్రజ్వాలనచేసి ప్రారంభించగా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులతో పాటు స్థానిక సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్ వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువకులు, స్థానిక బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు,తదితరులుపాల్గొన్నారు.

## సింగరేణిలో స్కూల్ బస్సులు నడపలేని స్థితికి దిగజారడం దారుణం
# టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి




**యైటింక్లయిన్ కాలనీ, జూన్ 14 :** సింగరేణి సంస్థ చివరకు స్కూల్ బస్సులు నడపలేని స్థితికి దిగజారడం ఆందోళన కలిగిస్తోందని, సంస్థ మనుగడను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే తమ నాయకుడు హరీష్‌రావు నేతృత్వంలో సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలను బయటపెట్టేందుకే కాంగ్రెస్ హటావో, సింగరేణి బచావో నినాదం భుజాన వేసుకున్నాడని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ భవన్ లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు ఉన్నాయా లేవా అన్న అనుమానం కలుగుతుందన్నారు. యైటింక్లయిన్ కాలనీ, సెంటినరీకాలనీల నుంచి గోదావరిఖనిలోని వివిధ స్కూళ్లకు వెళ్లే కార్మికుల పిల్లలకు నామమాత్రపు ఫీజుతో ఇన్నాళ్లు నడిపించిన స్కూల్ బస్సులను ఇప్పుడు రద్దు చేసేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకుంటే గుర్తింపు సంఘం తమకేమి పట్టనట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. సింగరేణిలో లేని బొగ్గు నిక్షేపాలను రికార్డుల్లో చూపిస్తూ కార్మికులను మోసం చేస్తున్నా పట్టడం లేదన్నారుతమ హయాంలో 15వేల మంది కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణ పేరుతో మెడికల్ బోర్డును ఏడాదిన్నరగా మూసివేయడం దారుణమన్నారు. నిన్నటి శ్రీరాంపూర్లో డిప్యూటీ సీఎం కార్మికులకు కనీసం లాభాల వాటా ప్రకటించలేదనీ, అసలు సింగరేణి సంస్థలో ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొందన్నారు.

కారుణ్య నియామకాలను కొనగిస్తా రా అన్న నమ్మకం లేదన్నారు. కార్మికుల సంక్షేమం, విద్య, వైద్యం విషయంలో యాజ మాన్యం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సంస్థకు బకాయి పడిన 54వేల కోట్లను వెంటనే ప్రభుత్వం అప్పగించాలన్నారు. సింగరేణిని ఏటీఎంగా వాడుకుంటూ కార్మికుల కష్టంను అప్పనంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు దోచి పెడుతుందన్నారు.

## తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష
# మాజీ మంత్రి జగదీష్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి :** తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితాపై భువనగిరి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది.ఈ సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. తెలంగాణ సాధకుడిగా, పదేళ్ల పాటు సీఎంగా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కేసీఆర్ గొప్పదనం ప్రజలందరికీ అర్థమయిందని అన్నారు.ఓటర్ జాబితా సవరణ అనేది ఓట్ల వడబోత కార్యక్రమమని,బీఆర్ఎస్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు.రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది. రైతు లు అడుగడుగునా మోసపోయా రు.ఇప్పటి కీ యాదాద్రి జిల్లా లో ధాన్యం కొను గోళ్లు పూర్తి కాలేదు.తడిసి మొలకలు వస్తున్నాయని ఆందోలన వ్యక్తం చేశా రు.ముఖ్య మంత్రి, మంత్రులు ప్రజల సొమ్ము ను దోచుకొని దాచుకుంటున్నారని ఆరోపించారు. హ్యాం రోడ్ల పేరుతో పెద్ద దోపిడీకి స్కెచ్ వేశారని,10 రూపాయల ఖర్చుతో చేసే పనిని 50 రూపాయలతో చేస్తూ వందల కోట్లు కమిషన్లు దోచుకు తింటు న్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హ్యాం రోడ్ల పేరుతో జరు గుతున్న దోపిడిపై విచారణ చేపిస్తామని వెల్లడించారు.హ్యాం రోడ్ల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా టోల్ బూత్ లు పెట్టె ప్రమాదం ఉందని పేర్కొన్నారు.నల్గొండ జిల్లా లో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి జరగడం లేదు.జిల్లా మంత్రులు పదవులను అనుభవి స్తున్నారే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, చింతల వెంకటేశ్వర రెడ్డి,జిల్లా అధ్యక్షుడు రామకృష్ణరెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణకాలనీ పాల ఉత్పత్తిదారుల సహకార
# సంఘం అధ్యక్షుడిగా సిరికొండ వెంకట్రావ్



**తిమ్మాపూర్,జూన్14:** తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణకాలనీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా సిరికొండ వెంకట్రావు వరుసగా తొమ్మిదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకు ముందు సిరికొండ వెంకట్రావు అధ్య క్షతన జరిగిన సమావేశంలో సంఘ అభివృద్ధి కార్యక్రమాలు, వార్షిక నివేదిక, ఆడిట్ నివేదిక, ఆర్థిక వ్యవహారాలు, ఇతర ముఖ్య మైన అంశాలపై విస్తృతంగా చర్చిం చారు.అలాగే సంఘానికి అత్యధికంగా పాలు పోసిన సభ్యులను గుర్తించి, వారి సేవలను అభినందిస్తూ ప్రత్యేక బహుమతులు అందజేశారు. సమావేశానికి హాజరైన సభ్యులు సంఘ అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా తనను మరోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు సిరికొండ వెంకట్రావ్వ ధన్యవాదాలు తెలిపారు. సంఘ అభివృద్ధికి మరింత కృషి చేస్తూ, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# అన్న దానం చేయడం అభినందనీయం



**జగిత్యాల రూరల్ :** అమావాస్య అన్నపూర్ణ మాత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజున అన్నదానం చేయడం అభినందనీయమని కౌన్సిలర్ మూలస్తం లావణ్య మహేష్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ చౌరస్తా వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్నదానం చేయడం అన్నిదానాలలోకెల్లా గొప్పదని చెప్పారు. ఈ సందర్భంగా 200 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అనంతుల సతీష్ కుమార్, హరీష్, మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ జిల్లాలో అనుమానాస్పద
# స్థితిలో గొర్లకాపరి మృతి

**జయశంకర్‌భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వేషాలపల్లి గ్రామంలో కొడారి సమ్మయ్య (65) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి మృతి చెందాడు. సమ్మయ్య గొర్ల కాపరిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన గొర్ల మంద వద్ద తలకు తీవ్ర గాయాలతో మృతి చెందాడు.ఆస్తికోసం కుమారులు హత్య చేసినట్లు గ్రామస్తులు చెబున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు. సమ్మయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి.



# ఫామ్‌హౌస్‌లో గెట్ టుగెదర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద మృతి



**యాదాద్రి:** భువనగిరి జిల్లాలో జరిగిన గెట్ టుగెదర్ పార్టీ విషాదంతమైంది. ఫామ్‌హౌస్‌లో స్నేహితులంతా కలిసి నిర్వహించిన వేడుకలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ శివారులోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులంతా కలిసి కొయ్యలగూడెం శివారు ఫామ్‌హౌస్‌లో గెట్ టుగెదర్ పార్టీ చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి మంచిర్యాల జిల్లాకు చెందిన గాండ్ల రాము (27) అనే యువకుడు హాజరయ్యాడు. ఈ క్రమంలోనే అతను అనుమానాస్పదంగా మృతిచెందాడు.మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పార్టీకి హాజరైన మిగతా స్నేహితులందర్నీ పోలీసులు విచారిస్తున్నారు.

## పల్నాడులో విషాదం పడవ బోల్తా
# పడి నలుగురు గల్లంతు



**అమరావతి :** పల్నాడు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విహారయాత్రకు వెళ్లిన పడవ బోల్తా పడి నలుగురు గల్లంతయ్యారు. జిల్లాలోని క్రోసూరులో 10 మంది బంధువులు నదిలో పడవలో విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పడవ బోల్తా పది మంది నీటమునిగిపోయారు. గమనించిన గ్రామస్థులు నీట మునిగినవారిలో ఆరుగురిని కాపాడారు.
గల్లంతైన మరో నలుగురి కోసం పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు.

## మాజీ ఎంపీ కేశినేని నాని రూ.120 కోట్ల బ్యాంకు
## కుంభకోణానికి పాల్పడ్డారు ఎంపీ కేశినేని శివనాథ్



**అమరావతి :** మాజీ ఎంపీ కేశినేని నాని రూ.120 కోట్ల బ్యాంకు కుంభకోణానకి పాల్పడ్డారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తీవ్ర ఆరోపణలు చేశారు. సామాన్యులు ఒక్క వాయిదా చెల్లించకుంటే బ్యాంకులు ఇంటి మీదకు వచ్చి దాడి చేసి పరువు తీస్తాయి. ఆస్తులు లాక్కుంటారు. కానీ ప్రజాధనం దోచుకుంటున్న రాజకీయ నాయకులను పట్టించుకోరని విమర్శించారు. ప్రజాధనం లూటీ చేసిన మాజీ ఎంపీ నాని అప్పు గురించి పట్టించుకోని బ్యాంకు అధికారులు ఎవరితో లాలూచీ పడ్డారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నాని ఖాతాలో రూ. 7 కోట్లు ఉన్నా ఆటో డిబిట్ ఎందుకు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టం తన పని తను చూసుకుంటుందన్నారు. పొద్దన లేస్తే రతన్ టాటా నాకు ఆదర్శం అని చెప్పే నాని ఆయన కంపెనీనే మోసం చేశాడని మండిపడ్డారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్‌పోల్‌ను అడ్డు పెట్టుకొని మోసం చేశాడని ఆరోపించారు.

## టీటీడీకి రూ.కోటి విరాళం అందజేసిన కోల్‌కతా ట్రస్టు



**తిరుమల :** వడ్డీకాసులవాడు తిరుమల వేంకటేశ్వరస్వామికి విరాళాల వర్షం కురుస్తుంది. టీటీడీ పరిధిలో నిర్వహిస్తున్న పలు ట్రస్టులకు భక్తులు విరివిగా విరాళాలను అందజేస్తున్నారు. ఆదివారం కోల్‌కతాలోని క్రిష్టాన్ ఫ్యామిలీ ట్రస్టుకు చెందిన ప్రతినిధి పదమ్ కుమార్ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం అందజేశారు. ఈ మేరకు దాత టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు చేతుల మీదుగా ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు డీడీని అందజేశారు. కాగా ఆదివారం కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదల ప్రకారం రంగనాయకుల మండపంలో తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

## స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో సర్టిఫికేట్లు
## తీసుకుంటున్నారా ఈ మార్పులు గమనించండి

**ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం**
**స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలలో స్టేషనరీ మార్పు**
**కొత్త స్టేషనరీలో హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్**

ఏపీలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలుసాధారణంగా కుల ధ్రువీకరణ పత్రమో.. జనన ధ్రువీకరణ పత్రమో కావాలంటే ఏం చేస్తాం.. గతంలో అయితే తహశీల్దారు కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు పౌర సేవలు మరింత సులభతరమయ్యాయి. మీ సేవా కేంద్రాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను సంప్రదిస్తున్నాం. వీటి ద్వారా ధ్రువపత్రాలు పొందుతున్నాము. అయితే ధ్రువపత్రాల కోసం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా సెంటర్లకు వెళ్లే వారికి ముఖ్య గమనిక. ఏపీ ప్రభుత్వం ధ్రువపత్రాలకు సంబంధించిన స్టేషనరీ మార్చింది. ధ్రువపత్రాలలో మార్పులు చస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉండేవి. ఏవైనా ధ్రువపత్రాలు కావాలంటే సచివాలయాల పేరుమీదే వాటిని జారీ చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలుగా మార్చింది. ఈ క్రమంలోనే పాత పేర్లతో ఉన్న ధ్రువపత్రాలను రద్దు చేస్తూ నింయం తీసుకుంది. జారీ చేసినట్లు తేలితే వారి ఐడీలు బ్లాక్ చేస్తామని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

## పర్యాటక బోట్లలో భద్రతాపరమైన లోపాలు నేటి
## నుంచి పాపికొండలు విహారయాత్ర నిలిపివేత

**అమరావతి :** నేటి నుంచి పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. గోదావరిలో పర్యాటక బోట్ల నిర్వహణపై భద్రతపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాగా, జూన్ 12న, 89 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ పర్యాటక పడవలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది దేవిపట్నం సమీపంలో గోదావరి నది మధ్యలో నిలిచిపోయింది. ప్రయాణికులను సురక్షితంగా తరలించినప్పటికీ, అధికారులు పడవను తనిఖీ చేయడానికి వెంటనే కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీల పక్రియను ముమ్మరం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. కునవరం నుండి (తెలంగాణలోని



భద్రాచలం మీదుగా) పాపికొండ కొండ శ్రేణిలోకి ప్రవేశించే పడవ సేవలకు ఈ నిలుపుదల వల్ల ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు పేర్కొన్నారు.

## విజయవాడ ప్రకాశం బ్యారేజి నాలుగు గేట్లు ఎత్తివేత

**అమరావతి :** విజయవాడ ప్రకాశం బ్యారేజీక వరద కొనసాగుతుండటంతో ఇరిగేషన్ అధికారులు నాలుగు గేట్లను అడుగు మేర ఎత్తి 2,900 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లలో పని చేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్. రవికిరణ్ సూచించారు. కృష్ణా నదికి మరో మూడు, నాలుగు రోజులు వరద ప్రవాహం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## పెళ్లైన మూడేళ్లకే నడుము విరిగి మంచానికే
# పరిమితం భార్యకు రెండో పెళ్లి చేసిన భర్త

**విశాఖపట్నం:** కడదాకా తోడుంటానని చేసిన బాసలు.. నీటి మీద రాతలయ్యాయి. ఏడు జన్మలూ తోడుంటానంటూ వేసిన ఏడు అడుగులు మూడేళ్ల ముచ్చటయ్యాయి. ధర్మార్థ కామాలలో నిను వదలి నేనుండను అంటూ కన్యాదానం సమయంలో పలికిన నాతిచరామి పలుకులను విధి ప్రశ్నార్థకం చేసింది. ఇన్ని ప్రతికూలతల మధ్యన భార్య భవిష్యత్తు కోసం ఆ భర్త తీసుకున్న నిర్ణయం.. ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చేలా చేస్తోంది. తాను కష్టపడినా ఫర్వాలేదు.. తనను నమ్మి వచ్చిన ఇల్లాలి జీవితం తన కారణంగా నాశనం కాకూడదన్న అతని త్యాగం.. కన్యాదానానికే కొత్త అర్థం చెప్తోంది. అనకాపల్లి జిల్లా టి. సరసపల్లిలోని గోవింద్ కథ.. చిన్నపాటి కష్టాన్ని కూడా భరించలేని నేటి యువతకు.. భార్యభర్తల బంధాన్ని అర్థం చేసుకోలేకపోతున్న యువ జంటలకు ఓ స్ఫూర్తి. ఆయన త్యాగం, పట్టుదల.. ఎంతోమందికి ఆదర్శం.
గోవింద్. శ్రీదేవికి కొత్తగా పెళ్లైంది. కొత్త కాపురం హాయిగా సాగిపోతోంది. అయితే అంతలోనే విధి చిన్నచూపు చూసింది. ఓ రోజు రైతు పొలంలో ఫీజు కట్టేందుకు వెళ్లిన గోవింద్.. అనుకోకుండా కరెంట్ షాక్‌కు గురయ్యారు. ఎత్తు నుంచి కింద పడటంతో వెన్నెముక విరిగింది. కొన్ని నెలల పాటు ఆస్పత్రికే పరిమితం కావాల్సి వచ్చింది. కొత్త కాపురంపై కోటి ఆశలతో ఉన్న ఆ జంటకు




అంతలోనే మరో చేదువార్త. గోవింద్ ఇక జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సి ఒదేనని.. లేచి తిరిగే అవకాశాలు లేవని వైద్యులు తేల్చేశారు. నిండు నూరేళ్లు కలిసి జీవిద్దామనుకున్న ఆ దంపతులు.. ఈ మాటతో నిరాశలో కూరుకుపోయారు. కానీ అంతటి విపత్కర పరిస్థితులలోనూ గోవింద్ తన స్వార్థం చూసుకోలేదు. తనను నమ్మి వచ్చిన అమ్మాయి జీవితం గురించే ఆలోచించారు. పాతికేళ్ల వయసులోనే మంచానికి పరిమితం కావాల్సి వచ్చినందుకు తన దురదృష్టాన్ని నిందించుకున్నారు. తన దురదృష్టం తన భార్య పాలిట శాపం కాకూడదని భావించారు. ఆమె జీవితాన్ని తన స్వార్థం కోసం ఎందుకు నాశనం చేయాలని ఆలోచించారు. తన భార్యకు మరో పెళ్లి చేయాలని సంకల్పించుకున్నారు. రెండో వివాహమంటే ఇవాల్టి రోజుల్లో సాధారణమే కానీ.. 1999లో పరిస్థితులు వేరే. భర్త ఉండగానే మరో పెళ్లి అనేది మధ్యతరగతి కుటుంబాలు ఆలోచించడానికి కూడా సాహసం చేయని అంశం. అలాంటి రోజులలో భార్యను, అత్తామామను ఒప్పించి తన భార్యకు రెండో పెళ్లి చేశారు గోవింద్. తనకు ఇచ్చిన కట్నం డబ్బులు అన్నీ ఇచ్చేసి ఆలికి రెండో పెళ్లి చేశారు. సొంత సుఖం చూసుకునే స్వార్థపూరిత ప్రపంచంలో.. భార్య భవిష్యత్తు కోసం తన ప్రేమను త్యాగం చేసిన గోవింద్.. ప్రేమించడమంటే దగ్గరగా ఉండటం కాదు.. అవతలి వ్యక్తి ఆనందం కోసం దూరం కావడం కూడా ప్రేమేనన్న ఓ సందేశాన్ని తన కథ ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. మంచానికే పరిమితమైన గోవింద్.. దేవుణ్ని నిందిస్తూ ఉండిపోలేదు. ఇంకొకరి భారం కాకూడదనే ఉద్దేశంతో చిన్నచిన్న టీవీ రిపేర్లు చేస్తూ ఖర్చులకు డబ్బులు సంపాదించుకుంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అలా పనిచేస్తూ మరొకరి భారంగా మారకుండా బతుకుతున్నారు. జీవితంలో ఇన్ని కష్టాలను చవిచూసిన గోవింద్.. పనిలో ఉంటే అవన్నీ గుర్తుకు రావంటున్నారు.. పనిలోనే విశ్రాంతిని, ఆనందాన్ని వెతుక్కుంటున్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం ఈ నెలాఖరులోగా
## ఖాతాల్లోకి డబ్బులు రైతులు ఇవి సరిచూసుకోండి

**ఆంధ్రప్రదేశ్:** రైతులకు ముఖ్య గమనిక. జూన్ నెలాఖరులోగా అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హత ఉండి కూడా.. వివరాల్లో తప్పుల కారణంగా పథకానికి దూరంగా ఉన్నవారు తప్పులు సవరించేందుకు ప్రస్తుతం అవకాశం కల్పించారు. రైతులు తమ పత్రాలతో రైతు సేవా కేంద్రం అధికారులనుసంప్రదించాలనిసూచి స్తున్నారు. నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తరించాయి. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడేందుకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు




విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన కింద ఏటా మూడు విడతల్లో అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాలలో ప్రభుత్వం రూ.20 వేలు జమచేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో పీఎం కిసాన్ యోజన కింద రూ.6000, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14000 సాయంగా అందిస్తున్నారు. ఈ క్రమంలోనే జూన్ నెలాఖరులోగా అన్నదాత సుఖీభవ పథకం సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇక ఈ పథకం లబ్ధిని అర్హులైన రైతులు నష్టపోకుండా చూసే చర్యలలో భాగంగా తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఏవైనా తప్పుల కారణంగా పథకం ప్రయోజనాలు పొందలేని రైతులు తమ తప్పులను సరిచేసుకోవడానికి ప్రస్తుతం అవకాశం కల్పించారు. అలాగే ఇప్పటి వరకూ ఈ పథకం లబ్ధి అందని రైతులు.. తమ సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. రైతు సేవా కేంద్రాలలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

### కమ్మవారికి టెట్ రాయకున్నా స్పోర్ట్స్ కోటాలో
### డీఎస్సీ పోస్టులు అసలు సంగతి అదన్నమాట



**ఆంధ్రప్రదేశ్**లో డీఎస్సీ పోస్టుల భర్తీ వ్యవహారం గతకొన్ని రోజులుగా చర్చనీయాంశమైంది. డీఎస్సీ పోస్టుల భర్తీపై విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలు ఆరోపణలు చేస్తోంది. పలువురు డీఎస్సీ అభ్యర్థులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలవటం.. వారికి న్యాయ సహాయం అందిస్తామని ఆయన హామీ కూడా ఇచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ పోస్టుల నియామకాలపై వైసీపీ పలు ఆరోపణలు చేస్తోంది. దీనిపై ఏపీ విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు వివరణ ఇస్తున్నప్పటికీ ఈ వివాదం చల్లారటం లేదు. ఈ క్రమంలోనే తాజాగా మరో ఆరోపణ తెరపైకి వచ్చింది. కమ్మ సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులకు టెట్ రాకపోయినా కూడా స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ పోస్టులు ఇచ్చారంటూ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ ఆరోపణలపై ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఈ ఆరోపణలను ఖండిస్తూ క్లారిటీ ఇచ్చింది. గత కొన్నిరోజులుగా డీఎస్సీ 2025 నియామకాలపై పద్ధతి ప్రకారం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం పేర్కొంది. ఉన్నతాధికారులు ప్రతి అంశంపై వివరణలు ఇచ్చినా మళ్లీ మళ్లీ అవే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపింది. తాజాగా కమ్మకులానికి చెందిన వారు టెట్ రాయకపోయినా స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ పోస్టులు ఇచ్చారనే తప్పుడు ప్రచారాన్ని మొదలెట్టారని.. బాధ్యతగల పదవులు నిర్వహించిన వ్యక్తులే దీనికి పాల్పడటం దురదృష్టకరమని అభిప్రాయపడింది.
2025 డీఎస్సీలో మొత్తం 15,941 మందిని ఉపాధ్యాయులుగా నియమించగా.. అందులో మహిళలు 7,955 మంది ఉన్నారని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది. మాజీ సైనికులు 112 మంది, ్రాషదీణ (దివ్యాంగులు)కోటా కింద 190 మంది, ఎ౦ కోటా కింద 158 మంది, కోటా కింద 119 మంది, కోటా కింద 24 మంది నియమితులైనట్లు వెల్లడించింది. స్పోర్ట్స్ కోటా కింద నియమితులైన 372 మందిలో.. బీసీలు 50%, ఎస్సీలు 30 %, ఎస్టీలు 8%, ఓసీలు 12 శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఈ 12 శాతం మంది ఓసీలలో కమ్మ కులానికి చెందినవారు కేవలం 9 మంది మాత్రమేనని క్లారిటీ ఇచ్చింది. ఈ కోటాలో కాపులు 16 మంది, రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు 10 మంది ఉన్నారని తెలిపింది.

### కాకినాడ జ్ఞానేశ్వరి కేసు పెంపుడు
### కుక్కకు పోస్టుమార్టం పూర్తి



**కాకినాడ జిల్లా:** తుని మండలం సీహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో మిస్టరీ కొనసాగుతోంది. ఈ కేసులో కీలక ఆధారంగా ఉన్న పెంపుడు కుక్క శనివారం చనిపోయింది. రెండు రోజులు వింతగా ప్రవర్తించిన కుక్క.. శనివారం ఉన్నట్లుండి ప్రాణాలు కోల్పోయింది. ఈ పెంపుడు కుక్కకు ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎన్. సూరవరం వెటర్నరీ సిబ్బంది పెంపుడు శునకానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఈ నమూనాలను విశాఖపట్నంలోని ఓ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ నేపథ్యంలో పోస్టుమార్టం నివేదికలో ఏముంటుందనేదీ ఇప్పుడు ప్రాధా న్యం సంతరించుకుంది. పెంపుడు కుక్కది సహజ మరణమా.. లేక విష ప్రయోగమా అనేది ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులో వెల్లడి కానుంది. దీంతో నివేదికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్డీఆర్ఎఫ్ బలగాలతో గాలింపు చర్యలుమరోవైపు చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై తొమ్మిది రోజులు కావటంతో పాప ఆచూకీపై ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో పాప ఆచూకీని గాలించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి.. గాలింపు చర్యలు చేపట్టాయి. జ్ఞానేశ్వరి ఇంటి సమీపంలోని పామాయిల్ తోట, స్థానికంగా ఉన్న నల్లకొండ మీద గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే జ్ఞానేశ్వరి తండ్రి గణేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త అనుమానాలకు తావిస్తున్నాయి. జ్ఞానేశ్వరి తమ ఇంటికి దగ్గర్లోనే ఆడుకునేదని.. 20 మీటర్ల దూరం కూడా వెళ్లేది కాదని గణేష్ చెప్తున్నారు. ఒంటరిగా దూరం వెళ్లే అలవాటు జ్ఞానేశ్వరికి లేదంటున్నారు. ఈ క్రమంలోనే గణేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారంటూ అనుమా నాలు వ్యక్తం చేయటం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక జ్ఞానేశ్వరి వెంట పెంపుడు కుక్క ఎప్పుడూ ఉంటుందని.. కుక్క తో కలిసి ఆడుకోవటం పాపకు అలవాటని చెప్తున్నారు. అయితే ఇప్పుడు ఆ పెంపుడు కుక్క చనిపోవటంతో పోలీసులు కీలక ఆధారాన్ని కోల్పోయారు.

**printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..**